నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

గంగమ్మకు రైతుల పూజలు

బైరాంనగరం వాగులో ప్రవహిస్తున్న నీటికి పూజలు నిర్వహిస్తున్న రైతులు, ప్రజలు

ఆలేరురూరల్, సెప్టెంబర్ 26 : మల్లన్న సాగర్ నుంచి విడుదలైన కాళేశ్వరం జలాలు గంధమల్ల చెరువు ద్వారా ఆలేరు మండల పరిధిలోని కొలనుపాక గ్రామమైన బైరాంనగరం వాగుకు గురువారం చేరుకున్నాయి. ఈ వాగులో నీటికి మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. నాయకులు మామిడాల అంజయ్య, మోత్కూరి ఐలయ్య, చాడ సురేందర్ రెడ్డి, నంద మహేందర్, బీమగోని సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కోసం క్యూ

- రాజధాని తర్వాత నల్లగొండలోనే ఎక్కువ రోగులు
- బాధితులకనుగుణంగా పెరుగని సేవలు
- అందుబాటులో ఉన్నవన్నీ కేసీఆర్ సర్కార్ చేసినవే
- కొత్త కేంద్రాలపై కాంగ్రెస్ సర్కార్ చర్యలు శూన్యం
- మరిన్ని కేంద్రాల కోసం పెరుగుతున్న డిమాండ్లు

రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

మూత్రపిండాల వ్యాధితో బాధపడే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా వారి బాధలు పట్టించుకునే వారే లేకపోయారు. ఎప్పుడు ప్రాణాలు పోతాయోనని బిక్కుబిక్కుమంటున్నా పాలకులకు పట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కేసీఆర్ సర్కార్ హయాంలో పురుడుపోసుకున్న డయాలసిస్ కేంద్రాలకు రోగుల తాకిడి పెరుగుతున్నది. దీంతో రోగుల అవసరాలకు అనుగుణంగా వాటి సంఖ్య పెంచాల్సిన కాంగ్రెస్ సర్కార్ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఉన్న డయాలసిస్ కేంద్రాల్లో బెడ్స్ కొరత కూడా రోగులను తీవ్రంగా వేధిస్తున్నది. డయాలసిస్ కోసం ప్రభుత్వ దవాఖానల్లో రోగులు రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తున్నది.

– నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ)

నల్లగొండలోని డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు

కాలానుగుణంగా మారుతున్న జీవన విధానాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రక్తపోటు, చక్కరవ్యాధి అదుపులో లేకపోవడం, పొగతాగడం, మద్యపానం, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో కిడ్నీ వ్యాధులకు గురవుతున్న పరిస్థితి రోజురోజుకూ పెరిగిపోతున్నది. ముఖ్యంగా మూత్రపిండాలు చెడిపోయిన వారికి డయాలసిస్ తప్పనిసరి అవుతున్నది. డయాలసిస్ కోసం సామాన్య ప్రజలు అష్టకష్టాలు పడేవారు. ఆర్థికంగానూ తీవ్ర భారం కావడంతో ఇల్లు, ఒళ్లు గుల్ల కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వీటన్నింటి పరిణామాల నేపథ్యంలో గత కేసీఆర్ సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డయాలసిస్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. జిల్లా కేంద్ర ఆస్పత్రులతోపాటు ఏరియా ఆస్పత్రుల వరకు డయాలసిస్ సేవలను దశలవారీగా అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది వేలకు మంది పైగా డయాలసిస్ సేవలు పొందుతున్న రోగులు ఉన్నట్లు అంచనా. అయితే రాజధాని హైదరాబాద్ తర్వాత అత్యధికంగా డయాలసిస్ సేవలు పొందుతున్న వారిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులే ఉన్నట్లు నిమ్స్ ఆస్పత్రి బృందం ఇటీవల నిర్వహించిన సర్వే స్పష్టమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు వేలకుపైగా డయాలసిస్ రోగులు ఉన్నట్లు అంచనా.

10 డయాలసిస్ సెంటర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం 10 డయాలసిస్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. నల్లగొండ జనరల్ ఆసుపత్రిలో 10 పడకలతో, మిర్యాలగూడ, భువనగిరి, ఆలేరు, దేవరకొండ, నాగార్జునసాగర్, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, చౌటుప్పల్‌లో ఐదు పడకలతో డయాలసిస్ సెంటర్లు గత సర్కార్ హయాంలోనే అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో దాదాపు షిఫ్టుల వారీగా ప్రతిరోజూ 200 నుంచి 250 మంది రోగులు సేవలు పొందుతున్నారు. ఇవి కాకుండా పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయి. మరికొంత మంది సొంతంగా డబ్బులు వెచ్చిస్తూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది 3 షిఫ్టుల్లో 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి ఒక్కొక్కరు వారానికి రెండు నుంచి నాలుగు సార్లు రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా నెఫ్రాలజీ డాక్టర్లు అందుబాటులో లేకపోయినా ట్రెయినీ టెక్నీషియన్ల నేతృత్వంలో డయాలసిస్ కొనసాగుతున్నది. ఎమర్జెన్సీ సందర్భాల్లో ఫిజీషియన్లు పర్యవేక్షిస్తున్నారు.

సాధ్యమైనంత వరకు సేవలు అందిస్తున్నాం

జిల్లాలో మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు పెరుగుతున్న మాట వాస్తవమే. జనరల్ ఆసుపత్రి డయాలసిస్ వార్డులో బాధితులను వెయిటింగ్‌లో ఉంచి డయాలసిస్ చేయాల్సి వస్తున్నది. నకిరేకల్, హాలియాకు ఐదు చొప్పున మిషన్లు మంజూరైనా సరైన భవనం లేక పెట్టలేక పోయాం. మర్రిగూడ, మిర్యాలగూడల్లో మరో ఐదు పడకల చొప్పున త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నం. ప్రస్తుత కేంద్రాల్లో సాధ్యమైనంత ఎక్కువ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నం. కిడ్నీ స్పెషలిస్టు వైద్యుల కోసం కూడా ఉన్నతాధికారులకు నివేదించాం.

– డాక్టర్ మాతృనాయక్, డీసీహెచ్ఎస్, నల్లగొండ

పెరుగుతున్న డిమాండ్

డయాలసిస్ అవసరమైన రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. దీంతో ఆయా డయాలసిస్ కేంద్రాల్లో బెడ్లకు డిమాండ్ ఏర్పడింది. అందుకు అనుగుణంగా డయాలసిస్ మిషన్ల సంఖ్యను, వార్డుల సంఖ్యను పెంచాలన్న డిమాండ్ వస్తున్నది. గత సర్కార్ సేవలుకు శ్రీకారం చుట్టగా అవే సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. అయితే రోగుల సంఖ్యకు అనుగుణంగా ప్రస్తుత సర్కార్ వీటి సంఖ్య పెంచడంపై దృష్టి సారించడం లేదు. దీంతో రోగులు తమకు ఎప్పుడు బెడ్ దొరుకుతుందా అని రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తున్నది. కొన్నిసార్లు డయాలసిస్ చేయించుకుంటున్న పేషెంట్ మృతి చెందితే తప్ప కొత్తగా మరొకరికి బెడ్ దొరుకని పరిస్థితి నెలకొంది. నల్లగొండ జనరల్ ఆస్పత్రిలో 10 మిషన్లు ఉండగా... అందులో 8 మిషన్లు సాధారణ వ్యక్తులకు, ఒకటి హెచ్ఐవీ, మరొకటి హెపటైటిస్ వ్యాధిగ్రస్తులకు కేటాయించారు. మిగతా ప్రాంతాల్లో నాలుగు మిషన్లు సాధారణ రోగులకు, మిగతాది ఇతరులకు సేవలు అందిస్తున్నాయి. అయితే నల్లగొండ ఆస్పత్రిలో ప్రస్తుతం 36 మంది డయాలసిస్ సేవల కోసం నిరీక్షిస్తూ పేర్లు నమోదు చేసుకుని ఉండడం గమనార్హం. ఇదేవిధంగా మిర్యాలగూడలో 10 మంది, దేవరకొండలో 15 మంది, ఇతర ఆస్పత్రుల్లోనూ ఇలాగే బెడ్స్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. ఇలా జిల్లాలోని అన్ని డయాలసిస్ సెంటర్లలో మరో 150 మంది వరకు బెడ్స్ కోసం రోగులు నిరీక్షిస్తున్నట్లు సమాచారం. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం బెడ్లు, సేవల సంఖ్యను పెంచకపోవడంతో సామాన్య ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లడం, ప్రైవేటు దవాఖానల్లో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఇది ఆర్థికంగా తీవ్ర భారం కావడంతో పాటు కుటుంబమంతా ఆస్పత్రుల చుట్టే తిరుగాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఇంకా విస్తరించాలని డిమాండ్..

ఉమ్మడి జిల్లాలోని డయాలసిస్ సెంటర్లన్నీ ఉస్మానియా హాస్పిటల్ హబ్ కింద పని చేస్తున్నాయి. వీటిల్లో నెఫ్రాలజీ సేవలు కూడా తరుచూ అందుబాటులో ఉండేలా చూడాలన్న డిమాండ్ వస్తున్నది. ప్రస్తుతం ఆరు నెలలకు ఓ సారి ఉస్మానియా నుంచి స్పెషలిస్ట్ వచ్చి డయాలసిస్ సెంటర్లను విజిట్ చేసి రోగుల హెల్త్ ప్రొఫైల్‌ను చెక్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ప్రస్తుతం కొనసాగుతున్న సెంటర్లతోపాటు ఉమ్మడి జిల్లా పరిధిలో హాలియా, నకిరేకల్, ఆలేరు, మోత్కూరు, తుంగతుర్తి, మర్రిగూడ లాంటిచోట్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లయితే బాధితులకు మరింత ఉపశమనం కలుగనుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కిడ్నీ వ్యాధిగ్రస్తులు కోరుతున్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కవిత

బాలల హక్కులు, సంరక్షణపై అవగాహన కల్పించాలి

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 26 : బాలలకు హక్కులు, సంరక్షణపై అవగాహన కల్పించాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత అన్నారు. జిల్లా న్యాసేవా అధికార సంస్థ, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్, రెడ్ క్రాస్ సొసైటీ, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఎస్టీ పాఠశాల విద్యార్థులకు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మిక నిర్మూలన, న్యాయ సహాయం, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, వివిధ అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బాలాజీ, సభ్యుడు డాక్టర్ అనిల్‌రెడ్డి, ఆయా శాఖల ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగే, చిత్రంలో అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 26 : వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ హనుమంత్ కె. జెండగే అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, భూమి, భుక్తి కోసం చేసిన పోరాటాలను ఆయన గుర్తు చేశారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు చాకలి ఐలమ్మ పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. జయంతి వేడుకలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి నాగి రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీబీనగర్ పెద్దచెరువు కట్ట అభివృద్ధిపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

బీబీనగర్, సెప్టెంబర్ 26 : బీబీనగర్ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువును గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మండలంలోని రాఘవాపురం గ్రామం పరిధిలో బునాదిగాని కాల్వను ఇరిగేషన్ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చెరువులు, కుంటలు, కాల్వలను అభివృద్ధి పర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో గల భువనగిరి, బీబీనగర్ చెరువులను సుందరీకరణ చేస్తూ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బీబీనగర్ చెరువు అభివృద్ధికి ఇప్పటికే రూ.నాలుగు కోట్లు మంజూరయ్యాయని, మరో రూ.ఆరు కోట్లు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నియోజకవర్గంలో ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల మార్కింగ్ నిర్వహిస్తామన్నారు. బునాది గాని కాల్వ, పిల్లాయిపల్లి కాల్వ, ధర్మారెడ్డి కాల్వల పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్ నుంచి వచ్చే మురుగు నీటితో బీబీనగర్ చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్టోళ్ల శ్యామ్‌గౌడ్, పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి పింగళ్ రెడ్డి, గోలి నరేందర్ రెడ్డి, మల్లగారి శ్రీనివాస్, బండారు ఆగమయ్యగౌడ్, సుర కంటి సత్తిరెడ్డి, చెరుకు అచ్చెయ్యగౌడ్, పంజాల పెంటయ్య, నారగోని మహేశ్, వెంకటేశ్, దండెం ప్రభాకర్, బెండ ప్రవీణ్, సురేశ్ గౌడ్ పాల్గొన్నారు.

భువనగిరి సబ్ జైలును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

న్యాయ సహాయానికి దరఖాస్తు చేసుకోవచ్చు

- భువనగిరి సబ్ జైలును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 26 : జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు ఎ.జయరాజు భువనగిరిలోని సబ్ జైలును గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలతో ముఖాముఖి జరిపి కోర్టుకు హాజరు అవుతున్నారా లేదా, వారి కేసుల్లో న్యాయవాదులు లేకున్నట్లయితే న్యాయ సహాయానికి న్యాయవాదులను నియమించడానికి దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. జైలులో ఏర్పాటు చేసిన న్యాయ సహాయ శిబిరాన్ని తనిఖీ చేసి, జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులు పరిశీలించి సూచనలు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న జిల్లాలోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం నిర్వహిస్తారని, రాజీపడదగు అన్ని కేసులు పరిష్కరించబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వి.మాధవీలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, జైలు సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

గుట్టలో నెట్‌వర్క్ బ్రిడ్జి ఏర్పాటుకు సన్నద్ధం

- గత ప్రభుత్వంలోనే 85 శాతం పనులు పూర్తి
- నెలలోపు బ్రిడ్జిని పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ఆదేశం

యాదగిరిగుట్టలోని నెట్‌వర్క్ బ్రిడ్జి

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు కొండపైకి వెళ్లే భక్తులకు ప్రత్యేకమైన నెట్‌వర్క్ ఆర్చ్ బ్రిడ్జి అందుబాటులోకి రానునంది. గత ప్రభుత్వంలోనే దాదాపు పనులు పూర్తికాగా కొద్ది పనులు మిగిలి ఉన్నాయి. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఫ్లై ఓవర్ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ. 69 కోట్లు వెచ్చించింది. ప్రత్యేకంగా లండన్ దేశం నుంచి నెట్‌వర్క్ ఆర్చ్ బ్రిడ్జికి సంబంధించిన విడిభాగాలను తెప్పించింది. రోజురోజుకూ గుట్టకు భక్తులు సంఖ్య పెరుగుతూ వస్తుంది. ఇందుకోసం కొండపైకి వెళ్లే వాహనదారులకు ప్రత్యేకమైన రెండు ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టగా ఇప్పటికే ఎగ్జిట్ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చింది. గత ప్రభుత్వంలోనే దాదాపుగా పనులు పూర్తికాగా నెట్ వర్క్ ఆర్చ్‌ని బిగించాల్సి ఉంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వీటి నిర్మాణంపై దృష్టి సారించింది. నెలలోపు బ్రిడ్జిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని దేవాదాయ శాఖ మంత్రి అధికారులను ఆదేశించారు.

లండన్ నుంచి ప్రత్యేకంగా దిగుమతి

గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలనుసారం యాదగిరి కొండపైకి వెళ్లేందుకు ప్రత్యేకమైన రోడ్లను నిర్మించారు. ఇందుకోసం రూ. 69 కోట్ల అంచనా వ్యయంతో రెండు ఫ్లైఓవర్లను నిర్మించగా, కొండకిందికి వెళ్లే ఎగ్జిట్ ఫ్లైఓవర్ ఏడాది కిత్రమే అందుబాటులోకి వచ్చింది. కొండపైకి వెళ్లేందుకు కొండ కింద వైకుంఠ ద్వారం సమీపంలో గల ఆర్యవైశ్య సత్రం నుంచి 12 మీటర్ల వెడల్పు, 445 మీటర్ల పొడవుతో మొదటి ఘాట్‌రోడ్డు పాత నిత్యాన్నదాన భవనం వరకు ఫ్లై ఓవర్‌ను అనుసంధానం చేశారు. ఈ ఫ్లైఓవర్‌ను 7 పిల్లర్లతో నిర్మాణం చేపట్టారు. 32 మీటర్ల మేర బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన స్పాన్ పనులు పూర్తయ్యాయి. ఇక లండన్ నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసిన నెట్‌వర్క్ ఆర్చ్ బ్రిడ్జిని బిగించనున్నారు. దేశంలో అత్యంత పొడవు గల 64 మీటర్ల పొడవులో ఆర్చ్ బ్రిడ్జి రానుంది. ఇప్పటికే 85 శాతం పనులు పూర్తికాగా మిగతావి పురోగతిలో ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం త్వరలో బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని సంకల్పించిన నేపథ్యంలో త్వరలో పనులు ప్రారంభంకానున్నట్లు అధికారులు వెల్లడించారు.గతంలో మాదిరిగానే వైటీడీఏ పరిధిలో ఈ పనులు చేపడుతారా? లేక దేవస్థానం ఆధ్వర్యంలోనే పనులను కొనసాగిస్తారా? అన్న విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

రాష్ట్రంలో గాడితప్పిన విద్యారంగం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

నీలగిరి, సెప్టెంబర్ 26 : రాష్ట్రంలో గాడితప్పిన విద్యారంగంలో మార్పుల కోసం ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట విద్యార్థి పోరు దీక్షను ఆయన ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా అధ్యక్షులు సీహెచ్ లక్ష్మీనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. రోజుకు 33 రూపాయలతో విద్యార్థులు మూడు పూటల భోజనం ఎలా చేస్తారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలకు సొంత భవనం త్వరగా పూర్తి చేయాలని, ఎంజీయూకు నిధులు కేటాయించి అభివృద్ధి పర్చాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేశ్, ఖమ్మంపాటి శంకర్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య, స్పందన నాయకలు, కుర్రా సైదానాయక్, ముస్కు రవీందర్, చందు, నవీన్, వీరన్న నాయక్, పుట్ట సంపత్, నవదీప్, తరుణ్, కిరణ్, మున్నా, సాయి పాల్గొన్నారు.

దేవాదుల కాల్వ భూములు కోల్పోయిన రైతులు దిగులు చెందొద్దు

- ధరణి పెండింగ్ ఫైళ్లు త్వరగా పూర్తి చేస్తాం
- గుండాల మండలంలో ఆర్ఎస్ఆర్ సరిచేసేందుకు స్పెషల్ డ్రైవ్
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్‌షాలోమ్

గుండాల తాసీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యలపై రివ్యూ చేస్తున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఆర్డీఓ అమరేందర్

గుండాల, సెప్టెంబర్ 26 : దేవాదుల కాల్వ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులు దిగులు చెందొద్దని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్‌షాలోమ్ అన్నారు. గుండాల తాసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆర్డీఓ అమరేందర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ అధికారులతో కలిసి ధరణిలో ఉన్న పెండింగ్ ఫైళ్లపై రివ్యూ నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతులు ధరణిలో వివిధ మాడ్యూల్స్ కింద చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం తాసీల్దార్ వద్ద 100 పెండింగ్ ఫైళ్లు ఉన్నాయని తెలిపారు. ధరణిలో మొత్తం 35 మాడ్యూల్స్ ఉంటే గుండాల మండలంలో 7 మాడ్యూల్స్ కింద ఎక్కువ దరఖాస్తులు వస్తున్నట్లు, ఇందులో ఎక్కువ శాతం దేవాదుల కాల్వ కింద రెండు సార్లు భూములు కోల్పోయిన రైతులు పాస్‌బుక్ డేటా కరెక్షన్‌లో మిస్సింగ్ సర్వే నంబర్ కింద దరఖాస్తు చేస్తున్నారని, వారు దిగులు పడవద్దని చెప్పారు.

దేవాదుల కాల్వ కింద రెండు సార్లు భూములు కోల్పోయిన రైతుల వివరాలను, అవార్డు కాఫీలను క్షుణ్ణంగా పరిశీలించి వారి భూమిని వారికి నమోదు చేయాలని తాసీల్దార్ జల కుమారిని ఆయన ఆదేశించారు. గుండాల మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల మాదిరిగా స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నూతన పాసు పుస్తకాల జాప్యంపై విలేకరులు ప్రశ్నించగా ఆయన బదులిస్తూ నూతన పాసు పస్తకాలు వచ్చే వరకు స్పెసిమెన్ కాఫీతో రైతులు తమ పనులను చేసుకోవాలని తెలిపారు. బ్యాంకు అధికారులు పంట రుణాల కోసం పాసుపుస్తకం అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వారి వెంట తాసీల్దార్ జల కుమారి, నాయబ్ తాసీల్దార్ నీలిమా, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

నెలరోజులైనా రోడ్డు మరమ్మతులేవి?

- రాష్ట్ర సరిహద్దులో ఎన్‌హెచ్ 65పై వన్ వే రాకపోకలు

కోదాడ మండలం రామాపురం వద్ద వరదలకు హైవే 65పై తెగిన పాలేరు వాగు బ్రిడ్జి రోడ్డు

కోదాడ రూరల్, సెప్టెంబర్ 26 : ఇటీవల భారీ వర్షాలకు కోదాడ మండల పరిధిలోని రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్ రోడ్డు సమీపంలో పాలేరు వాగు బ్రిడ్జి చివర ఎన్‌హెచ్ 65 రోడ్డు తెగిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు వన్ వే లోనే రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు తెగి నెల రోజులు దాటుతున్నా ఇరు రాష్ట్రాల మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ ఇటువైపు కన్నెత్తి చూడలేదు. నామ్‌కే వాస్తే అన్నట్లుగా వరదలు తగ్గాక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి జిల్లా అధికారులతో కలిసి పర్యటించి వెళ్లారు. అంతే తప్ప ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ ప్రారంభించకపోవడం గమనార్హం. రోడ్డు మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.